సమస్యల పరిష్కారమే లక్ష్యం

- గడప గడపకు మన ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

కార్వేటినగరం: సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామని.. ఇందులో భాగంగానే గడప గడపకు వచ్చి సమస్యలు తెలుసుకుంటున్నామని ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బాలగుంట, బీసీకాలనీ, బొందు వీధి, గొల్లచెంగమ్మ వీధి, శివాలయం వీధి, దివిటివీధి, టీకేఎం వీధుల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

- బీసీ కాలనీకి చెందిన లక్ష్మమ్మ మాట్లాడుతూ.. గతంలో ఏ ప్రభుత్వం అందించని విధంగా ప్రస్తుత ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉంటే పేదలు సంతోషంగా ఉంటారని తెలిపారు. కంటి వెలుగు పథకంలో భాగంగా ఆపరేషన్ చేయించుకున్నానని ఆనందం వ్యక్తం చేసింది.
- గాండ్లమిట్ట వీధికి చెందిన రోసయ్య(90) మాట్లాడుతూ.. తనకు వైఎస్సార్ పింఛన్ కానుక, తన కుటుంబానికి రైతు భరోసా, ఆసరా, వసతి దీవెన వంటి పథకాలను అందిస్తున్న ఈ ప్రభుత్వానికి రుణపడి ఉంటామని తెలిపారు. ముఖ్యమంత్రి చల్లగా ఉండాలని ఆశీర్వదించారు.
- ఈ రోజుల్లో కన్న కొడుకులే తల్లిదండ్రులకు అన్న పెట్టడం లేదు. అనాథాశ్రమాల్లో వదిలేస్తున్నారు. అలాంటిది వైఎస్ జగన్ సంక్షేమ పథకాలతో పాటు పింఛన్ ఇచ్చి ఆదుకుంటున్నారని కార్వేటినగరానికి చెందిన రాణి అన్నారు. తన లాంటి పిల్లలు లేని తల్లులకు జగనే పెద్దకొడుకు అని తెలిపారు.
- గొల్లచెంగమ్మ వీధికి చెందిన ఆదెమ్మ(75) మాట్లాడుతూ.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లాంటి కొడుకు ఒక్కడు ఉంటే చాలన్నారు. ఆయన ఇచ్చే పింఛన్‌తో జీవనం సాగిస్తున్నానని.. ఆయన ఎప్పుడూ ముఖ్యమంత్రిగా ఉంటూ తన లాంటి వృద్ధులకు అండగా ఉండాలని చెప్పారు.

సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులు

మంత్రి నారాయణస్వామి మాట్లాడుతూ.. కార్వేటినగరంలో ఏ ఇంటికి వెళ్లినా పూల వర్షంతో ఆప్యాయంగా స్వాగతిస్తున్నారని, సీఎం జగనన్న చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే కారణమన్నారు. గతంలో టీడీపీ కంచుకోటగా ఉన్న కార్వేటినగరం నేడు వైఎస్సార్‌సీపీకి బ్రహ్మరథం పట్టడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్వేటినగరాన్ని దత్తత తీసుకుని సీసీ రోడ్డు, డ్రైనేజీలు, స్కంధ పుష్కరిణిలో నీరాలి మండపం, టీటీడీ కల్యాణ మండపం వంటి అభివృద్ధి పనులు చేశామన్నారు. గ్రామస్తులు డ్రైనేజీ, సీసీ రోడ్డు, విద్యుత్ స్తంభం మార్పు చేయాలని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన మంత్రి వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

రాణిమహల్‌కు మహర్దశ

సంస్థానాధీశులు నిర్మించిన రాణిమహల్‌ను పురావస్తుశాఖ ద్వారా మ్యూజియం ఏర్పాటు చేయించి టూరిజం కారిడార్‌గా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని మంత్రి అన్నారు. అలాగే మండలంలోని కృష్ణాపురం జలాశయంలో బోటింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

కార్యక్రమంలో ఎంపీడీఓ మురళీమోహన్, తహసీల్దార్ పుల్లారెడ్డి, ఏడీఈ నాగరాజు, రాష్ట్ర దాసరి కార్పొరేషన్ డైరెక్టర్ సుమతి, ఎంపీపీ లత, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, రాష్ట్ర యువత ప్రధాన కార్యదర్శి ధనంజయరెడ్డి, మండల కన్వీనర్ శేఖర్‌రాజు, రాష్ట్ర ముస్లిం మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి హమీద్‌బాషా ఏఎంసీ వైస్ చైర్మన్ గోపి, సింగిల్ విండో అధ్యక్షుడు లోకనాథరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు పట్నం ప్రభాకర్‌రెడ్డి, సుబ్రమణ్యస్వామి ఆలయ చైర్మన్ కేశవరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ క్రిష్టయ్య, మోహనకుమారి, సర్పంచ్ ధనంజయ వర్మ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళదాం



మాట్లాడుతున్న సురేష్‌కుమార్

వడమాలపేట: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత గృహ సారథులు, వలంటీర్లపై ఉందని జేసీఎస్ మండల కన్వీనర్ సురేష్‌కుమార్ అన్నారు. మంగళవారం టీసీ. అగ్రహారం, పాదిరేడు, వడమాలపేట సచివాలయాల్లో వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. మా భవిష్యత్తు నువ్వే జగన్ కార్యక్రమాన్ని వారికి వివరించారు. ప్రభుత్వం ఎన్ని మంచి పనులు చేస్తున్నా ప్రతిపక్షాలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయని.. అలాంటి ఆరోపణలను తిప్పికొట్టాలని సూచించారు. గృహ సారథులు, వలంటీర్లు ఈ నెల 7వ తేదీ నుంచి ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా తెలుసుకోవాలన్నారు. సమస్యలను గుర్తించి పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో పుత్తూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శేఖర్, కాయం సింగిల్ విండో అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి, నాయకులు నందయ్య, మునిబాబు, చిన్నబ్బ, కృష్ణారెడ్డి, ముత్యాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కోదండరామునికి విశేష పూజలు



హరికథా గానం

వెదురుకుప్పం: మండలంలోని పెరుమాళ్లపల్లె, గుండుపల్లె, పచ్చికాపల్లం గ్రామాల్లోని కోదండరామస్వామి ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. నవమి ఉత్సవాల్లో భాగంగా పెరుమాళ్లపల్లెలో సోమవారం రాత్రి చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. బొమ్మన్‌దొడ్ల గ్రామంలో శ్రీకృష్ణ ఆలయంలో భక్తి ప్రపత్తులతో పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాదాలు పంచిపెట్టారు. భజనలు ఆకట్టుకున్నాయి.

నందిమంగళంలో అభివృద్ధి పనులు వేగవంతం



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి

పుత్తూరు రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని నందిమంగళం హరిజనవాడలో అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి తెలిపారు. మంగళవారం పనులను పరిశీలించారు. తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు 120 అడుగుల మేర పైపు లైన్లు వేస్తున్నట్లు చెప్పారు. అలాగే గ్రామంలో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. గ్రామ శ్మశాన వాటికలో ముళ్ల పొదలను తొలగించి, శుభ్రపరుస్తున్నట్లు తెలిపారు. తాగునీటి సమస్య పరిష్కరించినందుకు గ్రామస్తులు మంత్రి ఆర్కే రోజాకు కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు శివ, రమేష్ పాల్గొన్నారు.

దళితులపై దాడులను అరికట్టండి



మాట్లాడుతున్న నాగరాజు

పుత్తూరు రూరల్: దళితులు, మైనారిటీలపై జరుగుతున్న దాడులను అరికట్టడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని దళిత హక్కుల పోరాట సమితి(డీహెచ్‌పీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.నాగరాజు కోరారు. మంగళవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో దాడులను నిరసిస్తూ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల వారు దళితులు, మైనారిటీలపై జరుగుతున్న దాడులను అరికట్టడానికి కలిసి ఉద్యమించాలని కోరారు. సమావేశంలో సీపీఐ తిరుపతి జిల్లా కార్యదర్శి పి.మురళి, బహుజన సమాజ్ పార్టీ సత్యవేడు ఇన్‌చార్జి ధనంజయ, గోవిందస్వామి, రామచంద్రయ్య పాల్గొన్నారు.

గొల్లగంగమ్మకు ప్రత్యేక పూజలు



పూజలందుకున్న అమ్మవారు

పాలసముద్రం: మండలంలోని ఆముదాల పంచాయతీ గొల్లకండ్రిగ గ్రామంలో వెలసిన మూర్తెమ్మ (గొల్లగంగమ్మ)కు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వార్షిక కొలుపు మహోత్సవంలో భాగంగా గెరిగ ఊరేగింపు చేశారు. అంతకు ముందు ఉదయం ఆలయ అర్చకులు అమ్మవారికి పాలు, తేనె, నెయ్యి, పెరుగు, చందనంతో అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం మహిళలు పొంగళ్లు పెట్టి అమ్మవారికి సమర్పించారు. గెరిగ ఊరేగింపు సందర్భంగా ప్రతి ఇంటి వద్ద కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. గెరిగను అమ్మవారి గుడి వద్ద ఉంచి పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త నాగేష్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నాడు-నేడు పనుల్లో నాణ్యత తప్పనిసరి

పాలసముద్రం: మండలంలో నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంఈఓ రాజేంద్రప్రసాద్, ఎంపీడీఓ శ్రీనివాసన్ అన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నాడు-నేడు కింద ఎంపికైన పాఠశాలల హెచ్ఎంలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీనివాసన్ మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యార్థుల చదువులకు మొదటి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. విద్యార్థులకు మౌలిక వసతుల కోసం నాడు-నేడు పథకంలో పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. పనులు నిదానంగా జరుగుతున్నాయని.. త్వరగా పూర్తి చేసేలా చూడాలని సూచించారు. నాణ్యత పాటించాలని తెలిపారు.

వైభవంగా రథోత్సవం



రథాన్ని లాగుతున్న మంత్రి ఆర్కేరోజా

- రథం లాగి వేడుకలను ప్రారంభించిన మంత్రి ఆర్కేరోజా
- రథంపై కామాక్షీ సమేత కరకంఠేశ్వరుని విహారం

నగరి: స్వర్ణకాంతులు చిందే రథంపై కామాక్షీ సమేత కరకంఠేశ్వరుడు దేదీప్యమానంగా మాడవీధుల్లో విహరించారు. పట్టణ పరిధిలోని కామాక్షీ సమేత కరకంఠేశ్వర ఆలయంలో పంగుణోత్తర కల్యాణోత్సవ బ్రహ్మోత్సవాల్లో భాగంగా 7వ రోజు మంగళవారం రథోత్సవం నిర్వహించారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి ఆర్కేరోజా ఉత్సవాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఆలయ మార్యాదలతో ఆమెను ఆహ్వానించారు. హరహర నామస్మరణల మధ్య ఆమె రథాన్ని ముందుకు లాగి వేడుకలను ప్రారంభించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ఆమెతో పాటు రథాన్ని లాగారు. కరకంఠేశ్వరునికి కర్పూరహారతులిచ్చి దర్శించుకున్నారు. రథంపై విహరిస్తున్న స్వామివారికి ప్రతి ఇంటి వద్ద కొబ్బరికాయలు కొట్టి హారతులు పట్టారు. కిక్కిరిసిన జనం నడుమ మూడు గంటల పాటు ఊరేగింపు సాగింది. కేరళ వాయిద్య మేళాలు అలరించాయి. ఊరేగింపు అనంతరం ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, కమిషనర్ వెంకట్రామిరెడ్డి, పార్టీ నాయకులు గోపాల్‌రెడ్డి, దయానిధి, బీడీ భాస్కర్, ఇంద్రయ్య, శ్రీనివాసులు, తేన్‌మొళి, వేణి, సలీం, ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం, రథం విరాళ దాతలు కోనేరు అమృతమ్మ, సుబ్రమణ్య మొదలియార్, పెరుమాల్, సీఎస్ మణి, ఎస్ఆర్ మూర్తి, మొదలియార్ సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

హంతకులను కఠినంగా శిక్షించాలి



వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ మురగయ్య

వెదురుకుప్పం: రాజీ పేరుతో పిలిచి నాగరాజును అతి కిరాతకంగా చంపిన హంతకులను కఠినంగా శిక్షించాలని వడ్డెర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మురగయ్య డిమాండ్ చేశారు. మండలంలోని బ్రాహ్మణపల్లె గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఎస్.నాగరాజు(35)ను శనివారం రాత్రి కురవ కనుమ వద్ద హత్య చేసి తగలబెట్టిన ఉదంతం తెలిసిందే. విషయం తెలుసుకున్న వడ్డెర సంఘం నాయకుడు మురగయ్య మంగళవారం బ్రాహ్మణపల్లె గ్రామంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. జరిగిన ఘటనకు సంబంధించిన వివరాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. హత్య కేసులో పురోగతి సాధించడంలో పోలీసులు పేలవంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. బాధితులకు న్యాయం జరగకపోతే ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. నాగరాజు కుటుంబానికి ఇప్పటికీ బెదిరింపులు వస్తున్నాయని, వాటిని చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఆ కుటుంబానికి రక్షణ, న్యాయం జరగకపోతే ఆందోళనకు దిగుతామని తెలిపారు.

లోదుక్కులతో ఎన్నో లాభాలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ

పాలసముద్రం: వేసవిలో లోదుక్కులు చేసుకోవడం వల్ల ఎన్నో లాభాలు ఉంటాయని మండల వ్యవసాయ అధికారి ఢిల్లీప్రసాద్ అన్నారు. మంగళవారం చెరువుముందరకండ్రిగ గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. లోతు దుక్కులు చేసుకోవడం వల్ల పంటలకు ఆశించే చీడపీడలు, తెగుళ్లకు కారణమయ్యే వైరస్‌లు నశిస్తాయని తెలిపారు. అలాగే నేల బాగా గుల్లబారుతుందని చెప్పారు. పోషకాల లభ్యత కూడా పెరుగుతుందన్నారు. నాగళితో 60 నుంచి 90 సెంటీమీటర్ల లోతు వరకు దున్నుకోవాలని సూచించారు. అనంతరం రైతులకు లోతు దుక్కులు ఎలా చేయాలనే దానిపై క్షేత్రస్థాయిలో దుక్కులు చేసి చూపించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకురాలు వనజ, రైతులు పాల్గొన్నారు.

ప్రజాహితం.. మా అభిమతం



మహిళకు సంక్షేమ బుక్‌లెట్ అందిస్తున్న మంత్రి ఆర్కేరోజా

- మంత్రి ఆర్కేరోజా
- కేవీపురం సచివాలయ పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం

నగరి(విజయపురం): ప్రజాహితమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. విజయపురం మండలం కేవీపురం సచివాలయ పరిధిలోని కేవీ శ్రీరామపురం, మిట్ట హరిజనవాడ, దిగువ హరిజనవాడ గ్రామాల్లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా అని ఆరా తీశారు. ప్రభుత్వం వారికి అందించిన సంక్షేమ పథకాలను వివరించే బుక్‌లెట్‌ను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకెళుతోందని తెలిపారు. మారుమూల గ్రామాలను సైతం అభివృద్ధిబాటలో నడిపిస్తూ కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. కుళ్లు, కుతంత్రాలతో ప్రతిపక్షాలు అడ్డగోలుగా ఎదురు దాడికి దిగుతున్నాయని అన్నారు. ఎవరు మోసం చేస్తున్నది ఎవరు మంచిచేస్తున్నది అనే విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు. ఇళ్లు, పింఛన్లు, రేషన్ కార్డులు, మురుగు కాలువలు, తాగునీరు తదితర సమస్యలపై కొందరు మంత్రికి విన్నవించారు. స్పందించిన మంత్రి అక్కడే అధికారులతో మాట్లాడారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని సచివాలయ సిబ్బందిని హెచ్చరించారు. సచివాలయాలకు వచ్చే ప్రజల సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. వైస్ ఎంపీపీలు మంజు బాలాజీ, దశరదరాజు, ఎం.అగరం సింగిల్ విండో అధ్యక్షుడు హరినాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు గోపినాథ్, నాయకులు శివరాజు, శేఖర్‌రాజు, జిల్‌దాస్, గోవర్ధన్‌నాయుడు, నారపరాజు, రవి నాయుడు, బాలసుబ్రమణ్యం నాయుడు, అరుణాచలం, రమేష్‌ప్రసాద్ నాయుడు, గోపి, బాబురాజు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంపై అసత్య ఆరోపణలు తగవు



సమావేశంలో మాట్లాడుతున్న విజయకుమార్‌రెడ్డి

పెనుమూరు(కార్వేటినగరం): ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామిపై అసత్య ఆరోపణలు చేయడం తగదని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.విజయకుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం పెనుమూరులో విలేకరులతో మాట్లాడారు. నారాయణస్వామి ఆవేశపరుడే కానీ అవినీతిపరుడు మాత్రం కాదని తెలిపారు. కులమతాలకు అతీతంగా నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్న మంత్రిని కొందరు తమ స్వలాభం కోసం విమర్శించడం మంచిది కాదని హెచ్చరించారు. పెనుమూరు మండలంలో ఇప్పటి వరకు రూ. 23 కోట్లతో సీసీ రోడ్లు, రూ.2 కోట్లతో టీటీడీ కల్యాణ మండపం, బస్టాండ్ కాంప్లెక్స్, రూ. 22 కోట్లతో 50 పడకల ఆస్పత్రి, కలికిరి కొండను టీటీడీలో విలీనం, రూ.197 కోట్లతో ఎన్టీఆర్ జలాశయం ఆధునీకరణ, పాలిటెక్నికల్ కళాశాల తీసుకొచ్చిన ఘనత మంత్రి నారాయణస్వామిదేనని అన్నారు. మండలంలో కుటుంబ పాలనతో నాయకులు, కార్యకర్తలు విసిగిపోయారని తెలిపారు. పార్టీలోని కొందరు టీడీపీ నాయకులతో కలిసి డిప్యూటీ సీఎంపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని భారీ మెజారిటీతో గెలిపించేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి, పార్టీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు యశోధారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి దూదిమోహన్, నాయకులు కృష్ణారెడ్డి, దాము, జైచంద్రారెడ్డి, నవీన్‌రెడ్డి, మురళీ, యతీశ్వర్ నాయుడు, పండరీనాథ్ పాల్గొన్నారు.

మాతాశిశు మరణాల నియంత్రణే ధ్యేయం



సూచనలు చేస్తున్న డాక్టర్ దివ్య

గంగాధరనెల్లూరు: మాతా శిశుమరణాల నియంత్రణే లక్ష్యంగా ఆశా కార్యకర్తలు పని చేయాలని తూగుండ్రం పీహెచ్‌సీ వైద్యాధికారి దివ్య అన్నారు. పీహెచ్‌సీ ఆవరణలో మంగళవారం ఆశా డే కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన ఆహార నియమాలు, వైద్య పరీక్షలపై ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని సూచించారు. ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో నమోదు చేసిన ప్రతి గర్భిణికి 01244588000 నంబర్ నుంచి వాయిస్ కాల్స్ వస్తాయన్నారు. గర్భిణులు తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. డాక్టర్ ప్రశాంత్, ఆరోగ్యవిద్యాధికారి రాజేంద్రప్రసాద్, పీహెచ్ఎన్ శాంతి, సూపర్‌వైజర్లు వరలక్ష్మి, కృష్ణవేణి పాల్గొన్నారు.

తుంబురుతీర్థ ముక్కోటిపై సమీక్ష

తిరుమల: తిరుమలలో బుధ, గురువారాల్లో తుంబురుతీర్థ ముక్కోటిని నిర్వహించనున్నారు. ఈ క్రమంలో ఏర్పాట్లపై పీఏసీ 4లోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో మంగళవారం టీటీడీ విజిలెన్స్, తిరుమల పోలీసులు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు నిర్ణయాలు తీసుకున్నారు.

- తుంబురుతీర్థానికి బుధవారం ఉదయం 6 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, గురువారం ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు భక్తులను అనుమతిస్తారు.
- తీర్థానికి ఎక్కువ దూరం నడవాల్సి ఉన్న నేపథ్యంలో గుండె సమస్యలు, స్థూలకాయం ఉన్నవారిని అనుమతించరు.
- భక్తులు వంట సామగ్రి, కర్పూరం, అగ్గిపెట్టెలు తీసుకురాకూడదు.
- పాప వినాశనం వద్ద పార్కింగ్ సౌకర్యం లేదు. అందువల్ల ప్రైవేట్ ట్యాక్సీలు, వాహనాలను అనుమతించరు. ఆర్టీసీ బస్సుల్లో మాత్రమే భక్తులను అనుమతిస్తారు.
- పోలీసు, అటవీ, టీటీడీ విజిలెన్స్ విభాగం అధికారులు పాపవినాశనం నుంచి తుంబురు తీర్థం వరకు భద్రతా సిబ్బందిని నియమించారు.

వేడుకగా ఆర్జిత కల్యాణోత్సవం





కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు, ప్రత్యేక అలంకరణలో కాశీవిశ్వేశ్వరస్వామి

నగరి: టీటీడీ ఆధీనంలోని బుగ్గ అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి ఆర్జిత కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. చైత్ర శుద్ధ చతుర్దశి తిథి, ఉత్తర ఫల్గుణి నక్షత్రంలో నిర్వహించిన ఈ వేడుకకు స్థానిక భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా అన్నపూర్ణ, కాశీవిశ్వేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలను పట్టు వస్త్రాలు, పుష్పాలతో సుందరంగా అలంకరించారు. తిరుమల దేవస్థానం నుంచి వచ్చిన వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. అనంతరం అమ్మవారి పసుపు, అక్షింతలు భక్తులకు ప్రసాదంగా అందజేశారు. కార్యక్రమంలో టీటీడీ డిప్యూటీ ఈఓ నాగరత్న, సూపరింటెండెంట్ రమేష్, ఇన్‌స్పెక్టర్లు గుణశేఖర్, వెంకటరమణ, ఎంపీపీ భార్గవి, అర్చకులు కుప్పయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న మోహన్‌క్రిష్ణ

పాలసముద్రం: ఎండ తీవ్రత దృష్ట్యా వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ అన్నారు. మంగళవారం పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. వడదెబ్బలపై అవగాహన కల్పించారు. మోహన్‌క్రిష్ణ మాట్లాడుతూ.. ఉష్ణోగ్రతలు పెరిగిన నేపథ్యంలో బయటకు వెళ్లే వారు కాటన్ వస్త్రాలు, టోపీ ధరించాలని సూచించారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అవసరమైతే తప్ప బయటకు వెళ్లకపోవడం ఉత్తమమన్నారు. తరచూ నీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ వంటి ద్రావణాలు తీసుకోవాలన్నారు. వడదెబ్బకు గురైన వారు వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. తక్షణ ఉపశమనం కోసం ఓఆర్ఎస్ ద్రావణం తాగాలని తెలిపారు. కార్యక్రమంలో ఆశా నోడల్ ఆఫీసర్ సుశీల, సూపర్‌వైజర్ మురళి పాల్గొన్నారు.